క్లుప్తంగా

కాంగ్రెస్ హయాంలోనే జనరంజక పాలన



తరలివెళ్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ హయాంలోనే నిజమైన ప్రజాపాలన కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సీనియర్ నాయకులు ప్రేమ్‌గౌడ్ అన్నారు. కోకాపేట, గండిపేటలో జరిగిన శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరవుతుండటంతో సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ప్రేమ్‌గౌడ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారన్నారు. ఎన్నిల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. రానున్న కాలంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసి చూపించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తారన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పార్కు మొత్తం పిచ్చి మొక్కలమయం



పెద్దతాళ్లకుంటలో పెరిగిన పిచ్చి మొక్కలు

అత్తాపూర్: పెద్దతాళ్లకుంట పార్కు పరిసరాలను అభివృద్ధి చేయాలనే స్థానికులు కోరుతున్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో దట్టంగా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌తో పాటు చిన్న పిల్లలు, మహిళలు కూడా పార్క్‌కు వస్తుంటారు. వాకర్స్ తిరిగే ప్రాంతంలో రోడ్డుకు ఇరువైపులా కలుపు మొక్కలు దట్టంగా పెరిగిపోయాయి. దీంతో ప్రమాదకర క్రిమికీటకాలు విజృంభించే అవకాశాలు ఉండటంతో మహిళలు, పిల్లలు, భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒక్కరోజు తీర్థ యాత్రకు సూపర్ లగ్జరీ బస్సు

మియాపూర్: మియాపూర్-1 డిపో పరిధిలో ఒక్కరోజు తీర్థయాత్ర నిమిత్తం ఈ నెల 13న శనివారం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు మియాపూర్-1 డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. మహానంది, అహోబిళం (లక్ష్మీనరసింహ స్వామి ఆలయం), జోగులాంబ (శక్తిపీఠం), బీచుపల్లి (హనుమాన్ ఆలయం) దర్శించుకునేందుకు సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి 8 గంటలకు మియాపూర్ నుంచి బస్సు బయల్దేరి ఆదివారం ఉదయం 5 గంటలకు మహానందికి చేరుకుంటుందని తెలిపారు. అదేవిధంగా ఆదివారం రాత్రి 11 గంటల వరకు మియాపూర్‌కు తిరిగి చేరుకుంటుందన్నారు. వివరాల కోసం ఫోన్: 85003 09052, 76590 29882 లలో సంప్రదించాలని తెలిపారు.

తెలంగాణలో సందర్శన...

మియాపూర్-1 డిపో పరిధిలో స్పెషల్ టూర్ ప్యాకేజీతో ప్రతి ఆదివారం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మోహన్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి ఆదివారం తెలంగాణలోని ప్రసిద్ధ గణేష్ గడ్డ వినాయక ఆలయం, బీదర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం, రేజింతల్ వరసిద్ధి వినాయక ఆలయం, జరా సంఘం కేతకి సంగమేశ్వర ఆలయం, చిటకుల్ చాముండేశ్వరి ఆలయం, ఏడుపాయల వనదుర్గమాత ఆలయం దర్శన నిమిత్తం సూపర్ లగ్జరీ బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. మియాపూర్ నుంచి ప్రతి ఆదివారం ఉదయం 4 గంటలకు బయల్దేరి దర్శనానంతరం రాత్రి 11 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 30 మంది కంటే ఎక్కువగా భక్తులు ఉన్నచో ఏరోజైనా బస్సును నడపడం జరుగుతుందని తెలిపారు. వివరాలకు ఫో: 98486 70640, 99592 26153లలో సంప్రదించాలని తెలిపారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలను..

ఒడిసి పట్టేదెలా?

ఇంకుడు గుంతల నిర్మాణాల్లో నిర్లక్ష్యం

- ఇష్టారాజ్యంగా నీటి వినియోగం
- జలాల పరిరక్షణ చర్యలు నామమాత్రం
- అధికారుల తీరుపై సర్వత్రా ఆగ్రహం

జేఎన్ఎన్‌యూఆర్‌ఎంలో నిర్మించిన ఇంకుడు గుంత





శివసాయి నగర్‌లో నిర్మించిన ఇంకుడు గుంతలో పిచ్చిమొక్కలతో ఇలా...

బండ్లగూడ: భూమిపై ఉన్న ప్రాణకోటికి నీరే జీవనాధారం.. అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైన ఎంతైనా ఉంది. గత కాలంలో భూగర్భ జలాలు అతి తక్కువ లోతులోనే లభ్యమయ్యేవి. అధికంగా భూగర్భ జలాలను వాడుకోవడం వలన ఇప్పటికే జలాలు రానురాను అడుగంటిపోతున్నాయి.

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాధారణ కంటే అధికంగా వర్షపాతం నమోదవుతున్నా భూగర్భ జలాలు మాత్రం పెరగడం లేదు. దీనికి కారణం ఇంకుడు గుంతలు లేకపోవడమే. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న నివాసాలు, వాణిజ్య సముదాయాలతో పాటు ఖాళీ స్థలాలు, బహిరంగా ప్రదేశాలన్నింటిని కాంక్రీట్‌తో కప్పేస్తుండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. ఈ భూగర్భ జల మట్టం ప్రమాద స్థాయికి చేరక ముందే మేల్కొని భూగర్భ జల మట్టాన్ని పెంచవలసిన అవసరం మనందరిపైన ఎంతైనా ఉంది.

150 అడుగు లోతులోనే నీరు...

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అప్పట్లో 150 అడుగు లోతులోనే పుష్కలంగా నీరు ఉండేది. ఇప్పుడు 1000 అడుగులర తవ్వితే కానీ బోర్లలో నీటి చుక్క జాడ కనిపించట్లేదు. ప్రతి ఇంట్లో నిత్యం అవసరాలకు ఉపయోగించే నీటికన్నా వృథాగా పోయే నీరే ఎక్కువ. భూగర్భ జలాలను పెంపొందించాలంటే వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేస్తేనే భూగర్భ జలమట్టం పెరిగి వేసవిలో నీటి ఎద్దడి సమస్య తగ్గుతుంది.

ఇంకుడు గుంతల నిర్మాణం ఒక మార్గం...

భూగర్భ జలాలను పెంచడం కోసం ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం ఒక మార్గం. ఇందుకు ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడం వ్యక్తి గతంగానే కాకుండా ప్రతి ఒక్కరు సామాజిక పరంగా ప్రజల్లో అవగాహణ చేపట్టి భారీ ఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టగలిగే ప్రయత్నం చేస్తే సరైనా ప్రతి ఫలం పొందగలం.

నిబంధన ఉన్నా...

ఇంటి నిర్మాణ అనుమతులు జారీ చేసే సమయంలో ఇంకుడుగుంత నిర్మించాలనే నిబంధన ఉన్నప్పటికీ, ఎవరూ పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారులూ కూడా పట్టించుకోకపోవడంతో నిర్మాణ దారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. వర్షపు నీరు వచ్చే కింది ప్రాంతాలలో ఉన్న ప్రభుత్వ స్థలాలు, పార్కు స్థలాలలో ఇంకుడుగుంత



బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

నిర్మాణం చేపట్టే విధంగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు చేపట్టవలసిందిగా స్థానికులు కోరుతున్నారు.

మరమ్మతులు నిల్

కార్పొరేషన్ పరిధిలో ఇప్పటి వరకు అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన ఇంకుడు గుంతల్లో పేరుకుపోయిన చెత్తను, మట్టిని కూడా తీయడం లేదు. వాటిలో పేరుకుపోయిన మట్టిని పూర్తిగా తొలగించి మరమ్మతులు చేసి వర్షపు నీరు నేరుగా ఇంకుడు గుంతలోకి చేరేలా ఏర్పాటు చేసుకుంటే భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి.

పెరుగుతున్న నిర్మాణాలు...

ప్రస్తుతం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కిస్మత్‌పూర్, దర్గాఖలీజ్‌ఖాన్, హిమాయత్‌సాగర్, పీరంచెరువు, గంధంగూడ, బైరాగిగూడ, హైదర్షాకోట్, బండ్లగూడ ప్రాంతాలు ఉండగా 37,718 కిపైగా నివాస గృహలు, 1.60 లక్షల జనాభా, 200కుపైగా కాలనీలు ఉన్నాయి. ఆయా కాలనీల్లో నిర్మాణాల జాతర పెద్ద ఎత్తున సాగుతున్నాయి. కనీసం ఇంకుడు గుంతలు నిర్మించాలనే ప్రభుత్వ నిబంధనను సరిగా అమలు చేయకపోతుండటం, అధికారులు వీటిపై చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రతి ఇంటికీ తాగునీరు చరిత్రాత్మకం!

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ప్రతి ఇంటికీ నిత్యం తాగునీరు ఇవ్వటం, మూసీ నదిని ప్రక్షాళన చేయటం రాజేంద్రనగర్ నియోజకవర్గ చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. సోమవారం గండిపేటలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి రూ. 7,360 కోట్ల నిధులతో చేపట్టిన గోదావరి 2, 3వ విడతల నీటిని తెచ్చి గండిపేట, హిమాయత్ సాగర్‌లను నింపటం, అందులో కొంత మూసీనదిలోకి వదిలి దానికి పూర్వ వైభవం తెచ్చే పనులను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గంలో రోజురోజుకూ జనాభా పెరిగిపోతోందని, అందుకు అనుగుణంగా ఇప్పటి వరకు మంజీరా, కృష్ణా నీటిని అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో గోదావరి నీరు సైతం రావటం ఎంతో శుభ సూచికమన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టునే ఇపుడు ఈ రూపంలో ఇక్కడి వరకు చేర్చటం ఇక్కడి ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ప్రజలకు అవసరమైన పనులను చేపట్టేందుకు తాను ముందుంటానని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో సహకరిస్తున్నారన్నారు. రాబోయే రెండు సంవత్సరాల్లో ప్రతి



సీఎం ప్రారంభించిన పైలాన్ వద్ద ఎమ్మెల్యేతో ఫొటోలు దిగుతున్న నాయకులు

ఇంటికీ ప్రతి రోజే తాగునీరు వస్తే ప్రజలు ఎంతో సంతోషిస్తారన్నారు. నియోజకవర్గం పరిధిలోని మణికొండ, నార్సింగి, శంషాబాద్‌లలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా పెరిగిందని, పలు చోట్ల ఫ్లై ఓవర్లు, రోడ్ల విస్తరణ పనులు చేపట్టి ప్రజల సమస్యను తీర్చాలని కోరారు. మూసీ సుందరీకరణ చేసి, గండిపేట చెరువును మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలన్నారు. సమావేశంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నార్సింగి అధ్యక్షుడు కె.అశోక్ యాదవ్, బండ్లగూడ అధ్యక్షుడు పి.కృష్ణారెడ్డి, మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు, మాజీ కౌన్సిలర్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

హుస్సేన్‌సాగర్‌కు మురుగునీరు రాకుండా చర్యలు తీసుకోవాలి

అబిడ్స్: హుస్సేన్‌సాగర్‌కు మురుగునీటి ప్రవాహం రాకుండా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొబ్బరి నీళ్లతో హుస్సేన్ సాగర్ నింపుతామన్న ఆయన కలను రేవంత్‌రెడ్డి నెరవేర్చాలన్నారు. గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగిందని సీఎం రేవంత్‌రెడ్డి హుస్సేన్‌సాగర్‌కు రావడం ఎంతో అభినందనీయమన్నారు. మురుగునీటిలో దురదృష్ట వశాత్తు మనం గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేస్తున్నామన్నారు. హుస్సేన్‌సాగర్‌కు ఏ ప్రాంతం నుంచి అయినా మురుగునీరు రాకుండా డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలించాలన్నారు. డ్రైనేజీ వ్యవస్థను ఇతర ప్రాంతాలకు తరలిస్తే హుస్సేన్‌సాగర్‌ను మంచినీళ్లతో నింపవచ్చని రాజాసింగ్ అన్నారు. వెంటనే రేవంత్‌రెడ్డి రాబోయే సంవత్సరంలోనైనా వినాయకుడి నిమజ్జనాన్ని మంచినీరు కలిగి ఉండే హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం చేసేలా ప్రణాళికలు రూపొందించి పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

విద్యతోనే సమస్యలకు పరిష్కారం

- యువజన విద్యా శాఖ డీడీ నాగలక్ష్మి
- పాల్మాకులలో సందడిగా 'ఉల్లాస్' ర్యాలీ

శంషాబాద్ రూరల్: అన్ని సమస్యలకు చదువు పరిష్కారం చూపుతుంది.. మహిళలు తప్పనిసరిగా చదువుకోవాలి అని యువజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని పాల్మాకులలో నవభారత్ సాక్షరత మిషన్ 'ఉల్లాస్' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ... నిరక్షరాస్యతను తగ్గించి.. అందరికీ విద్యను అందించడం ఈ కార్యక్రమం ఉద్దేశమన్నారు. చదవడం, రాయడం అందరి ప్రాథమిక హక్కు అని తెలిపారు. అక్షరాస్యత ద్వారా వ్యక్తిగత అభివృద్ధి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, సమాజ ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. నిరక్షరాస్యను గుర్తించి వారి వివరాలను ఆన్‌లైన్‌లో పొందపరుస్తామని అన్నారు. మండలంలోని 3269 మంది నిరక్షరాసులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరి విద్యా బోధనకు ఆయా గ్రామాల్లో 360 మంది విద్యా టీచర్లను ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్పీ పల్లె ఆనంద్, పాల్మాకుల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు, 'ఉల్లాస్' మండల ఎంఆర్పీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



పాల్మాకులలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మి తదితరులు

ప్రజావాణి ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

అత్తాపూర్: ప్రజావాణి కార్యక్రమంలో వివిధ అంశాలపై వచ్చే ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నామని జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన సోమవారం తన కార్యాలయంలో ప్రజల వద్ద నుంచి మూడు ఫిర్యాదులను స్వీకరించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి ఒకటి, రెవెన్యూ విభాగానికి ఒకటి, ఇంజనీరింగ్ విభాగానికి ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుగుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శ్రీధర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి

- ఎన్‌సీసీ అధికారి జేపీ రెడ్డి



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు

మణికొండ: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని, అవి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని సికింద్రాబాద్ రీజియన్ ఎన్‌సీసీ మొదటి అధికారి జేపీ రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని శ్లోక స్కూల్‌లో సోమవారం నూతన విద్యార్థి మండలి ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచే మంచి క్రమశిక్షణను అలవర్చుకోవటంతో పాటు ఇతరులకు నేర్పించే స్థాయికి చేరుకోవాలని అభిప్రాయపడ్డారు. ఉత్తమ క్రమశిక్షణ జీవితంలో ఉన్నత స్థానానికి చేరుస్తుందని ఆయన స్పష్టం చేశారు. వినయం, నిజాయితీ, అంకితభావం పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా హెడ్ గర్ల్ సిద్ధి ప్రియారెడ్డి, హెడ్ బాయ్ వెంకటసాయి మోనిష్, డిప్యూటీ హెడ్ గర్ల్ ఎం. విగ్నా వైష్ణవి, డిప్యూటీ హెడ్ బాయ్ వి. యశ్వంత్, హౌస్ కెప్టెన్‌లు లక్ష్మీసుమేధ, సాకేత్, సావిత్రీ, లక్ష్య శ్రీ, లక్ష్మీ సార్వని, సత్య అనిష్, కలంగి ప్రణన్య, తక్షస్ బ్రహ్మర్షి దీవి, పౌరాణిక, కృతి ఆరాధ్య, హర్షవర్ధ్, శ్రీసారయులకు బ్యాచ్‌లను అందించి వారితో ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బి.వెంకట్‌రెడ్డి, ఎండీ వినోదరెడ్డి, ప్రిన్సిపాల్ నిధి పాండేలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవసమాజ స్థాపకులు టీచర్లు



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

మణికొండ: మనకు విద్యాబుద్ధులు నేర్పించి, జీవితంలో ఉన్నతంగా తీర్చిదిద్దే ఉపాధ్యాయులను ప్రతి ఒక్కరూ గౌరవించుకోవాలని మణికొండ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజాన్ని ఉత్తమంగా తయారు చేయటంలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిదన్నారు. మణికొండ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దాలన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎ.కుమార్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు బి.రవికాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శివరామిరెడ్డి, నాయకులు జె.సిద్ధప్ప, బి.శ్రీరాములు, శ్రావణ్‌కుమార్, శివగంగ, రాజేష్, గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్ పాల్గొన్నారు.

అజ్ఞానాంధకారాలను తొలగించేది గురువులే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

అత్తాపూర్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది వారిని సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారు చేసేది గురువులే అని శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమటి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకొని సోమవారం పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివరాంపల్లి ఉన్నత పాఠశాల ప్రాథమిక పాఠశాల, వీకర్‌సెక్షన్ పాఠశాలలకు సంబంధించిన వంద మంది ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో అమ్మా, నాన్నల తరువాత స్థానం గురువుకి ఇచ్చారని, గురువు గొప్పతనాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ దేశానికి చాటిచెప్పారన్నారు. ఆయన చేసిన సేవలు మరువలేనివని అన్నారు. అంధకారాన్ని తొలగించి అజ్ఞానం స్థానంలో జ్ఞానాన్ని బోధించే గొప్ప వ్యక్తి గురువని అన్నారు. గురువుల సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనునాయక్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సునీత, ఉపాధ్యాయులు సుదర్శన్, జనార్దన్‌చారి, వెంకటయ్య, సుధాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రూపారెడ్డి, కరుణాకర్, సరళమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ధిక్కార స్వరం కాళోజీ




మాట్లాడుతున్న నందిని సిధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ ధిక్కార స్వరం ప్రజా కవి కాళోజీ నారాయణరావు అని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ నందిని సిధారెడ్డి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలుగు భాషా చైతన్య సమితి, కుసుమ ధర్మన్న కళాపీఠం, గోల్కొండ సాహితీ కళా సమితిల సంయుక్త ఆధ్వర్యంలో ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆహూతులను ఆకట్టుకుంది. తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎస్.బాలాచారి, రామకృష్ణ చంద్రమౌళి, బడేసాబ్, డాక్టర్ రాధాకుసుమ పాల్గొన్నారు.

విధులపై ఏఎంవీఐలకు అవగాహన

మణికొండ: సరైన అనుమతులు, పత్రాలు లేని వాహనాలను ఎప్పటికప్పుడు అరికడితేనే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంవీఐ నవీన్ పేర్కొన్నారు. మణికొండలోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఇటీవల కొత్తగా చేరిన 22 మంది సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లకు సోమవారం ఆయన మోటారు వాహన చట్టం, వాహనాలపై నమోదు చేసే కేసులపై అవగాహన కల్పించారు. రవాణా శాఖ కార్యాలయంలో జారీ చేసే లైసెన్సులు, వాహన బదిలీ, కొత్త వాహనాల రిజిస్ట్రేషన్‌లు, నెంబర్ ప్లేట్‌ల జారీ తదితర విషయాలపైనా అవగాహన పెంచుకోవాలన్నారు. ఆరు నెలల పాటు చట్టం గురించి తెలుసుకున్న వారు విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లపై అవగాహన ఉండాలన్నారు. ఈ శిక్షణ 20 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో సహాయ ఎంవీఐలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీనియర్ ఎంవీఐ కిరణ్‌కుమార్‌రెడ్డి

విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలపై అవగాహన అవసరం

ఎంజీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్‌రెడ్డి



విదేశీ విద్యపై అవగాహన కల్పిస్తున్న ప్రతినిధులు

మణికొండ: విదేశాల్లో ఉన్నత విద్య చదివితే మరింత మంచి ఉద్యోగావకాశాలు వస్తున్నాయని, ఉత్సాహం ఉన్న విద్యార్థులు వాటిపై అవగాహన పెంచుకుని సద్వినియోగం చేసుకోవాలని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం గండిపేటలోని కళాశాలలో గ్లోబల్ ఎడ్యుకేషన్, కెరీర్స్ ఫోరం, కెరీర్ గైడెన్స్ సెల్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వన్ డే క్యాంపస్ స్టడీ అబ్రాడ్ ఫెయిర్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విదేశాల్లో ఉన్నత విద్యావకాశాలు, ప్రవేశ ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, విద్యా రుణాలు, వీసా సమాచారాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ, ఫ్రాన్స్ వంటి దేశాలకు చెందిన ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, కెరీర్ గైడెన్స్ సెల్ అధిపతి డాక్టర్ సి.ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.